6-4-73

433

# నింగి — నేలా

అసిరిగాడిది పూర్తిగా నేలంటు బ్రతుకు. సంఘంలో కొంచెం ఎత్తుగా తలెత్తుకోడానికి, వాడికి వృత్తి, కులమూ, హోదా డబ్బూ వీటి ఆసరా ఏమీలేదు. నీళ్లూ రాళ్లూ బుగ్గి బూడిదా మన్నూ మశానంతో కూడిన గొగ్గిగొగ్గుల నేల లాగే వాడి బ్రతుకుకూడా అర్థాకలీ, అవమానం, కన్నీళ్ళూ కలతనిద్రా - వీటితో అడుగడుగునా గతుకులు గతుకులుగా నికృష్టంగా నడుస్తోంది.

ఊళ్లో ఎవరు చచ్చిపోయినా అసిరిగాడు వెళ్ళి బాజా వాయించాల్సిందే! వాడి "చావు బాజా" లేకుండా ఊళ్లో ఏ శవమూ శ్మశానంవేపు కదల్దు అలా ఊళ్ళోవాళ్ల చావులమీద వాడు బతుకుతూండడంవల్లే వాడంటే ప్రతి వాడికీ అసహ్యం, చీదరింపూను. వాడిలాగే ఊళ్ళోవాళ్ళ బాధల పునాదులమీదా, అనారోగ్యాల ఆసరామీదా, తమ బతుకుల్ని నడుపుకుంటున్నవాళ్లు కొందరు ఉన్నారు.

వాళ్ళల్లో ఒకళ్లు రాజయ్యా, మరొకళ్లు డాక్టర్ సుదర్శనమూను. అవతలివాడి అవసరాన్నిబట్టి బారువడ్డీలకీ, చక్రవడ్డీలకీ తనఖాలమీద అప్పులిచ్చి, అందినంత మట్టుకి అందరి ఆస్తులూ రాజయ్య కాజేసుకుంటుంటే, చిన్న రోగాలకి పెద్ద చికిత్సలు చేసీ, అరకుతో పోయేదానికి ఆపరేషన్లు దాకా చేసీ వేలకివేలు వెనకేసుకుంటాడు సుదర్శనం. ఇద్దరికీ ప్రజల కష్టాలు కానీ, కన్నీళ్లు కానీ ఏం పట్టవు. వాళ్ళ కంగారూ భయం ఎంతసేపటికీ ప్రజలెక్కడ హాయిగా, సుఖంగా ఉంటారో అనే- వాళ్లు బతికేది కూడా లోకం ఏడుపు మీదే! అయినా వాళ్ళిద్దరినీ ఎవరూ అసహ్యించుకోరు, చీదరించుకోరు. పైగా సమయానికి ఆదుకున్నాడని రాజయ్యనీ, మృత్యు ముఖం నుంచి కాపాడేడని సుదర్శనాన్నీ వేనోళ్ళ పొగుడుతారు.

దానికి కారణం వాళ్లది అసిరిగాడిదిలా నేలంటు బ్రతుకు కాకపోవడమే!

కళ్ళని జిగేల్ మనిపించే వెలుగుల్ని విరజిమ్ముతూ, క్షణ క్షణానికీ రంగు రంగుల మబ్బు దుస్తుల్ని మారుస్తూ ఎత్తుగా గర్వంగా బోర విరుచుకుని దర్జాగా వంగి ఇంద్రనీలాల కాంతితో ధగధగా మెరిసిపోయే నింగిలాంటి జీవితం వాళ్ళది. కాని అసిరిగాడి జీవితం అలా కాదుగా? అపశకునానికీ అశుభానికీ సంకేతంలా స్థిరపడిపోయిన అసిరిగాడి మొహం పొద్దున్నే చూడటానికి ఎవరూ ఇష్టపడరు. పెళ్ళిళ్లూ ఉత్సవాలూ వంటి శుభసమయాల్లో సరేసరి! వాడా పరిసరాల్లో కనిపించడానికే వీలులేదు.

ఇలా అడుగడుక్కీ అవమానాలూ, ఈసడింపులూ, ఛీవాట్లూ భరిస్తూ కూడా వాడు దిగులుపడకుండా ఆ ఊళ్ళోనే ఉండిపోయాడంటే అందుకు రెండే రెండు కారణాలున్నాయి.

వాటిలో ఒకటి: వాడి ఏకాంత జీవితంలోకి ఎక్కడి నుంచో వచ్చి ప్రవేశించిన బాబిగాడి అమాయకమైన పసితనపు బోసినవ్వూ.

రెండోది: డాక్టర్ సుదర్శనంగారి పద్దెనిమిదేళ్ళ రజని చక్రాల్లాంటి కళ్లల్లో విరిసే తడిసిన పారిజాతంలాంటి చల్లని జాలిచూపూ.

ఈ రెండే కనక లేకపోతే, అడుగడుగునా ఎదురయ్యే అవమానాలకీ, అందరి దగ్గర్నుంచీ అకారణంగా లభించే ఛివాట్లకీ విసుగెత్తి, ఆ ఊరు యెప్పుడో విడిచిపోయి ఉండేవాడు.

అసలా ఊళ్ళో ఏం ఉందని! ఓ జాలా, దయా, ఆదరణా?

ఎంతసేపటికీ వాడిని వీడు మోసంచెయ్యా. వీడికి వాడు గోతులు తవ్వా, వాడినెత్తికొట్టి వీడూ వీడిని క్షోభ పెట్టి వాడూ ఎలా సుఖపడదామా అన్న ధ్యానే ప్రతివాడికీ. కక్షలతోనూ కార్పణ్యాలతోనూ ప్రతి నిముషం బుసలు కొడుతూ ఒకణ్ణి ఒకడు కాటెయ్యడానికి సమయంకోసం పగబట్టిన పాముల్లా కాసుక్కూచుంటారు ఆ వూళ్ళోవున్న జనం అంతా. అలాంటి జనాన్ని ఒకడిమీదికి ఒకణ్ణి ఉసికొలిపి వాళ్ళ కొట్లాటలకి కావలసిన డబ్బుని అప్పుగా యిస్తూ అంది

సంతమట్టుకి, అందరి ఆస్తులూ కాజేసుకుని మూడంతస్థుల మేడ ఒకటి వూరికి అటు రాజయ్యకడితే, న్యాయం, ధర్మం ఉచిత వైద్యం అంటూనే రెండు చేతులా సంపాదించి, బ్రహ్మాండమైన ఆసుపత్రి ఒకటి ఊరికి ఇటు కట్టాడు సుదర్శనం. ఇటూ అటూ వున్న ఆ రెండు భవనాలతో, రెండు తలల నాగులా కనిపిస్తూ, ఉండుండి కడివెడు కడివెడు విషం అయితే కక్కుతూ ఉంటుంది, ఆ వూరు.

ఆదరణా ఆప్యాయతా ఎండిపోయి, బోగులు బోగులు మంటూన్న ఆ ఊళ్ళో, జాలీ దయా అసిరిగాడికి కనిపించింది రజని కళ్ళల్లోనే!

మొదటిసారి తను రజనిని చూసింది ఆమెకు పన్నెండేళ్లు వున్నప్పుడు.

ఆ రోజున ఆ వీధి వెంట చావు బాజా వాయిస్తూ వెళ్తూంటే, సుదర్శనంగారి రెండో అంతస్థు కిటికీలోంచి, నీళ్లు నిండిన కళ్ళతో, ముఖంనిండా జాలీ దయా నింపుకుని, కనిపించింది రజని.

ఆ సమయంలో అసిరిగాడికి ఆమె నింగిలో విరిసిన హరివిల్లులా తోచింది. నేలంటు బ్రతుకుల తలనిమిరి ఊరట కలిగించటం కోసం ఆకాశం జాలిగా వంగినట్లూ; నేల వెర్రి ఆవేశంతో చేతులు జాపుకుని దిక్కుల చివళ్లకంటా పరిగెడుతున్నట్లూ, అక్కడ ఎక్కడో అవి రెండూ కలుసుకున్నట్లూ అనిపించింది అసిరిగాడికి. అంతే - కట్టలేని ఆనందంతో తన్మయత్వం చెంది మరింత జాలిగా చావు బాజా వాయించాడు

అసిరిగాడు - రజని చల్లని చూపులు వచ్చి మనస్సునీ, శరీరాన్నీ సేదదీరుస్తూంటే. ఇంకా యెంతసేపు ఆ తన్మయస్థితిలో వుండిపోయేవాడో! ఇంతలో వాళ్ల నాన్న కిటికీ దగ్గరికి వచ్చి "అమ్మా తప్పు శవాలు వెళ్ళడం చూడకూడదు" అన్నారు. అంతే—

ఇంద్రధనుస్సు కరిగిపోయింది.

సుదర్శనంగారి వేడిచూపులు మాత్రం వచ్చి అసిరిగాడికి చురుక్కుమంటూ తగిలాయి.

ఆ తర్వాత నేలకి ఏ రెండు మూడు పర్యాయాలైనా, ఎత్తైన అంతస్థులోంచి వచ్చే రజని జాలి చూపులు, అట్టడుగు స్థానంలో ఉన్న అసిరిగాడి మనస్సుకి మంచిగంధపు పూత పూసి, దైన్యాన్నీ, బాధనీ పోగొట్టి సేదతీర్చేవి. వాటిని ఎన్నిరోజుల దాకానో గుండెల్లో పదిలంగా దాచుకుని, తీరిగ్గా కూచునప్పుడల్లా జ్ఞాపకం తెచ్చుకుని, మురిసిపోయేవాడు అసిరిగాడు.

తనా దారిన బాజా వాయిస్తూ వెళితే, యెప్పుడేనా రజని మొహం కనక కిటికీదగ్గర కనిపించకపోతే వాడి ప్రాణం విలవిల్లాడిపోయేది. కళ్లు ఆ యింటి గుమ్మాల్నీ, కిటికీల్నీ వదలి వచ్చేవి కావు. అలాంటప్పుడు బాజామీది కళ్లు తడబడేవి కూడా. మళ్ళీ రజనిని చూసేదాకా మనస్సంతా ఏదో దిగులుగానూ, నిరుత్సాహంగానూ ఏ పని చెయ్యడానికీ ఇష్టం లేకుండానూ ఉండేది.

ఇలా అసిరిగాడు ఏ అయిదారేళ్లు రజని చల్లని చూపుల నీడలో సేదదేరాడో ఏమో!

"రజని పెళ్ళిటా!" అని యెవరో అంటూండగా విన్న వ్వాడు అసిరిగాడు ఒక్క క్షణం చలనం లేకుండా వుండి పోయాడు. ఆ రోజు వాడు మతిలేకుండా వూళ్ళో అన్ని వీధులూ తిరిగాడు. వండుకున్న అన్నం తినలేదు పాకముందు రోజులాగే కళ్ళాపుడల్లి ముగ్గెట్టి ముంతల్లో నీళ్లు నింపుదాం అని లోపలికెళ్ళిన పక్కింటి పైడితల్లికి, పాక నిట్రాడుకి దిగాలుగా జేర్లాపడి కూచుని కనిపించాడు అసిరిగాడు. పైడితల్లి పరాచకం ఆడబోతే గట్టిగా విసుక్కుని వీధులట్టిపోయాడు.

"ఏవిట్రా ఆ దడి తాటాకులు ఒత్తిగించి అలా చూస్తున్నావు. అయినా అవుశకునం మొహానివి పెళ్ళింటి దగ్గర నీకేంపని? డాక్టరుగారి కంటబడ్డావో నిన్ను చంపేస్తారు...పో...ఊ...పొమ్మంటుంటే" అంటూ పాహుకారు రాదయ్య కుర్కుని తరిమిపెల్లు తరిమాడు.

"పెళ్ళి ముస్తాబులో రజని ఎల్లావుందో" చివరికి చూశ్శమే పడలేదు అసిరిగాకికి. రజని అత్తారింటి కెళ్ళిపోయింది. "ఏంటి మువ్వీనుద్దె ఎక్కడపడితే అక్కడ దిగాలుగా కూచుని ఉంకిపోతున్నావు?" అని యెన్నిసుట్లో పక్కపాకలో పోతరాజు అడిగాడు అసిరిగాడిని.

"అన్నం కూడా సరిగా తింటంలేదట! మన పైడితల్లి సెప్పింది" అంది పోతరాజు పెళ్ళాం రంగి.

పైడితల్లి పాక యెనకాల కెళ్ళి పరికిణీతో కళ్లు ఒత్తుకుంది.

నిజమే - అసిరిగాడు మరీ దిగాలుగా, తప్పదన్నట్లు రోజులు గడుపుతున్నాడు.

తప్పనిసరి అయి చావు బాజా వాయించవలసి వచ్చి, డా॥ సుదర్శనం ఇంటిముందునించి వెళితే మాత్రం అసిరిగాడి కళ్ళన్నీ ఏదో పోగొట్టుకున్నట్టు, రజని లేని ఆ గుమ్మాల్నీ కిటికీల్నీ వెతికేవి. బాజామీద వేళ్లు సరిగ్గా పడేవికావు. మనస్సంతా చిరాగ్గా, తిక్కగా ఉండేది. వాడి వాలకం చూసి అంతా "లాభంలేదు, వీడికి త్వరలో పిచ్చెక్కుతుంది" అనుకున్నారు, కాని దేవుడు అంతవరకూ రానియ్యలేదు. "రజనిని మరిచిపోరా" అని వాడికి బాబిగాడి నిచ్చాడు.

ఓ రోజు అసిరిగాడు తెలతెల వారకుండా శ్మశానం పక్కనుంచి వస్తూంటే చంటిపిల్లాడి ఏడుపు వినిపించింది. దాసీదాని భవిష్యత్తుమీద జాలివహించి రాజయ్య ఏర్పాటుచేసిన మనుష్యులు అప్పటికే, ఆ చంటాడి పీక నులిమెయ్యబోతూ, అసిరిగాడి అడుగుల చప్పుడు విని పారిపోయారు.

దిక్కులేకుండా శ్మశానంలో పడి ఏడుస్తూన్న ఆ పసికందుని యెత్తుకుని తన గుడిసెకి తీసుకురాకుండా ఉండలేకపోయాడు అసిరిగాడు. అంతే, అప్పటినుంచి బాబిగాడు బోసినవ్వులు నవ్వుతూ అసిరిగాడి ఏకాంత జీవితంలో వెలుగులు పండించసాగాడు. అసిరిగాడిలో తిరిగి పూర్వపు ఉత్సాహం, చైతన్యం కనిపించసాగాయి.

పక్కింటి పైడితల్లి ముఖం విప్పారింది.

ఎప్పుడేనా రజని జ్ఞాపకం వచ్చినప్పుడు మాత్రం చూరునుంచి కారుతూన్న నీళ్ళచుక్కల్ని చూస్తూనో, గుడిసె నడికొప్పు కంతల్లోంచి కనిపించే ఆకాశాన్ని చూస్తూనో పరధ్యాన్నంగా గంటలకి గంటలు ఆమట్టునే ఉండిపోయేవాడు అసిరిగాడు. అలాంటి సమయంలో పలకరించటానికి భయం వేసేది పైడితల్లికి. జ్ఞాపకాల లోకంనుంచి ఈ లోకానికి అసిరిగాడిని తీసుకుని రాగలిగింది, మళ్ళీ బాబిగాడి చిరునవ్వు ఒక్కటే!

ఆ చిరునవ్వే కరువైపోయింది వారంరోజుల్నుంచి.

వడ్లగింజ వేస్తే పేలాపగింజ అయ్యేలాగ కాస్తోంది జ్వరం. బుగ్గలు యెండిపోయి, చిక్కి శల్యంలా అయిపోయి మంచానికి అల్లంటుకుపోయి మగతిగా పడుకున్నాడు బాబిగాడు. అస్తమానూ ఆడుతూ గెంతుతూ వచ్చీరాని మాటలతో తన చుట్టూ తిరుగుతూ వెర్రినాగన్నలా కాలక్షేపం చేసుకొనేవాడు. వాడిని చూసినకొద్దీ పెద్ద కెరటంలా ఆపుకోలేనంత ఏడుపు వచ్చేస్తోంది అసిరిగాడికి. పొద్దుట ఆచార్లుగారు, "నా శాయశక్తులా చూశానురా అబ్బాయ్! లాభం లేదు. ఆ సుదర్శనంచేత సూదిమందు వేయించి చూడు, అదృష్టం వుంటే..." అంటూ ఆ పై మాటలు మందుల సంచితో సహా మూటకట్టేస్తూ లేచిన దృశ్యం జ్ఞాపకం వచ్చేసరికి కుప్పకూలినట్లు కూలిపోయాడు అసిరిగాడు.

గుడిసెచుట్టూ చీకట్లు ముసురుకుంటున్నాయి.

గుడిసె లోపల, గాలికి రెపరెపలాడుతూ మినుకు మినుకు మంటూన్న దీపంలా బాబిగాడు.

"నాన్నా-బాబీ" అన్నాడు మంచం మీాద ఒంగి బొంగురు బోయిన కంఠంతో అసిరిగాడు. జవాబు లేదు. మగతిగా కదుకుని వున్నాడు. "కళ్ళు తెరవరా నాన్నా! నీకు చెమ్కీ టోపీ, చెప్పులు తెచ్చాను చూశావా? నీ మీాద ఎన్ని ఆశలు పెట్టుకున్నానురా" అంటూ బావురుమని ఏడ్చేశాడు అసిరిగాడు.

నెమ్మదిగా తీసుకుంటూన్న శ్వాసవల్ల కుర్రాడి డొక్క ఎముకలు కొద్దిగా లేస్తున్నాయి. కళ్ళు తుడుచుకుని ఒక్కక్షణం బాబిగాడి కేసి చూశాడు. కీడు జరుగుతుందేమో అనే భయం గడ్డకట్టించే చలిలా గుండెలకి తగిలింది. నిలువెల్లా వణికిపోయాడు. నోటికి గుప్పిళ్ళు అడ్డుపెట్టుకుని ఏడుస్తూ సుదర్శనం ఆసుపత్రికేసి పరిగెట్టాడు ...

అసిరిగాడి ఏడుపుకి చీదరించుకున్నాడు డాక్టర్ సుదర్శనం. "చెప్తుంటే నీకు కాదూ? ఆ చీటీలో రాసిన మందులు తెచ్చుకుంటే మా కాంపౌండర్ వచ్చి ఇంజెక్షన్ ఇస్తాడు. అయినా లక్షణాలు చెప్పావుకదా, నేను రావడం దేనికి నీ గుడిసెకి ?" అంటూ విసురుగా లోపలికి వెళ్ళి పోయిన సుదర్శనం దిక్కుగా చూస్తూ వెర్రిగా ఆ మట్టునే వుండిపోయాడు అసిరిగాడు.

"డాక్టరుగారి అమ్మాయి పురిటికి వచ్చింది. ఇప్పుడు

ప్రసవించే సమయం. ఆయన అందువల్ల ఆదుర్దాగా వున్నారు. అంతే-రేపు రా" అంది నర్సు.

"ఆ! రజనీ వచ్చిందా!"

ఆ మాట పైకే అన్నాడో లోపలే అనుకున్నాడో తెలియదు.

రజని కనిపిస్తుందేమో అనే ఆశతో పిచ్చివాడిలా ఆ గుమ్మందగ్గర ఎంతసేపున్నాడో కూడా తెలియదు.

కొరడాతో కొట్టినట్లు బాబిగాడి సంగతి జ్ఞాపకం వచ్చి ఒక్క పరుగున మందులషాపుకి వెళ్ళాడు అసిరిగాడు. పదిరూపాయ లిచ్చి మరీ మందులు పట్టికెళ్ళ మన్నాడు షాపువాడు.

పది రూపాయలు!

తన దగ్గర చిల్లిగవ్వ లేదే!

ఎవరిస్తారు అప్పు? ఏం చూసి ఇస్తారు?

అప్పులనగానే అసిరిగాడికి రాజయ్యే జ్ఞాపకం వచ్చాడు.

మాటకీ మాటకీ మధ్యన ఒగుర్చుకుంటూ తనగోడు వెళ్ళబోసుకుంటూన్న అసిరిగాడిని చూసి జాలిపడి గుమస్తా "ఒకేయ్ నువ్వీ సమయంలో రాజయ్యగారికి కనిపించావంటే చంపేస్తారు. అసలే వాళ్ల నాన్నగారు ఇప్పుడో, ఇంకో క్షణానికో అన్నట్లు గుటుకూ గుటుకూమంటూ వున్నారు. పిల్లాడి మందుకోసం అన్నావు కనక నా దగ్గర ఉన్న బాపతే ఏదో ఇస్తాను. తాకట్టుకి ఏం పట్టుకొచ్చావు?" అన్నాడు.

తా...క...ట్టు!

తన దగ్గర తాకట్టుకి తాహతైన వస్తువేం వుంది?

అంచు విరిగిన కుండా, అల్యూమినియం గ్లాసూ, అన్నం దాకా, కుక్కిమంచం- ఇవేగా?

ఏం లేవన్నాడు. సాయం చెయ్యమన్నాడు. కాళ్లట్టుకుంటానన్నాడు.

ఏ లాభం లేదని గుమాస్తా పెదవి విరిచాడు.

"నా దగ్గర ఆ చావు బాజాతప్ప ఇంకేం లేదండి" ఏడుస్తూ అన్నాడు అసిరిగాడు.

గుమాస్తా అదిరిపడ్డాడు. "ఏమిట్రా, చావు బాజా తాకట్టు పెడతావా? నువ్వు బాకీ తీర్చకపోతే దాన్ని నేనేం చేసుకోను? నీ బరులు నేను వాయించనా? ఫో...పో...చావు బాజా తాకట్టు పెడ్తాట్ట, చావుబాజా" అంటూ తరిమేశాడు గుమాస్తా, అసిరిగాడు ఏడుస్తూ ఎంతగా కాళ్ళావేళ్ళాపడి బతిమాలినా వినిపించుకోకుండా -

గుడిసెలోకి వెళ్లడానికి కొండంత భయం.

గుండెలు దడదడా కొట్టుకుంటున్నాయి.

బాబిగాడు ఎలా వున్నాడో!

జడుస్తూ జడుస్తూ లోపలికి వెళ్ళాడు -

హమ్మయ్య, దేవుడు తనకి అన్యాయం చెయ్యలేదు.

ఇప్పుడేనా పది రూపాయలుంటే బాబిగాడు బతుకుతాడు. కాని ఎలావస్తాయి? తనకి ఎలావస్తాయి పది రూపాయలు? ఎలాగ! పది రూపాయలు! ప...దీ...

మూలనున్న చావు బాజామీద, గోడ బెత్తుపడి దిబ్బుమని చప్పుడైంది.

అసిరిగాడి వెన్నుపూసలో ఝల్లుమంది. బాబిగాడు చావు బతుకుల్లోవున్న ఈ సమయంలో ఈ చప్పుడేమిటి ?

భయంతో బాధగా అటు చూశాడు.

అవును ఇదే తననిప్పుడు ఆదుకోవాలి. నిజమే!

ఊళ్ళో ఇప్పుడెవరేనా చచ్చిపోతే?

ఏ రాజయ్యో తండ్రో!

పది రూపాయలకి తక్కువైతే బాజా వాయించనని మొండికేస్తాను.

ఆఁ! ...అంతే!... పది రూపాయలు వస్తాయి. బాబిగాడు బతుకుతాడు.

వాడు బతకాలంటే ఊళ్ళో ఎవరేనా చావాలి...

కట్టలు తెంచుకుని గుండెల్లోంచి దుఃఖం పొర్లిపోతోంది అసిరిగాడికి.

ఏం చెయ్యను? నాది వెధవ జన్మ. నేను అపశకునాలు పలికేవాడిని-అశుభాన్ని కోరుకునేవాడ్ని-నా బాబిగాడికోసం ఇంకొకళ్ళు చావాలని కోరుకోవడం పాపమే-నీచమే-కాని ఏం చెయ్యను?" అని బావురుమంటూ గోడకి జేర్లా పడిపోయాడు అసిరిగాడు.

"అసిరీ!... ఓ అసిరిగా!" అని పిల్చి పిల్చి సమాధానం లేకపోయేసరికి ఒంగుని పాకలోకి దూరివచ్చాడు సుదర్శనం కాంపౌండరు. అతణ్ణి చూస్తూనే త్రుళ్ళిపడ్డాడు అసిరిగాడు.

"ప్రసవించలేక రజనమ్మగారు చనిపోయింది రా-నువ్వొచ్చి చావు బాజా వాయించాలి!"

పిడుగులాంటి వార్త వినేసరికి నవనాడులూ బిగిసి పోయి జీవంలేనట్లు కాంపౌండరుకేసి చూశాడు అసిరిగాడు.

నింగికి ఎగసిపోయిన రజని
నేలమీద మిగిలిపోయిన తను
చావు బతుకులో బాబిగాడు

అంతస్థుమీద అంతస్థు పెంచుకుంటూ బతికున్న వాళ్లకి చావు బాజా వాయిస్తూన్న డాక్టరు!

చచ్చిపోయిన శవాల్ని రూపాయల రాశిగా పేరుస్తూన్న రాజయ్యా.

రమ్మని పిలుస్తూన్న కాంపౌండరూ-పొమ్మని తోసేస్తూన్న గుమాస్తా.

డాక్టరూ. బాబిగాడూ-కాంపౌండరూ రాజయ్యా-తనూ గుమాస్తా-రజనీ చావుబాజా-

బాబిగాడూ రజనీ! డాక్టరు రాజయ్యా! తనూ చావు బాజా! రూపాయలూ బాబిగాడూ-మేడా రూపాయలూ - ఏడుపులూ-కేకలూ- అరుపులూ - నవ్వులూ - రూపాలు - శబ్దాలు-శబ్దాలు-రూపాలు- వందలు వేలు - వేలు లక్షలు - మహావేగంగా కలగా పులగంగా - అటూ ఇటూ ఇటూ అటూ-ఏడుపులు నవ్వులు-ఏడుపులు నవ్వులు-

వెలుగూ చీకటీ ఎత్తూ కల్లం-ఆకాశం-నేలా-మట్టీ-మబ్బూ-గిర గిరా గిర గిరా-

కళ్ళుగట్టిగామూసుకుని కెవ్వుమనిఅరిచాడు అసిరిగాడు. అంతే!-

ఒక్కసారిగా అల్లకల్లోలం అంతా అణిగిపోయింది. మెదడులో ఆలోచన లేదు-శరీరంలో చైతన్యం లేదు-కళ్ళల్లో జీవం లేదు-

జీవంపోయిన గాజుకళ్ళకి ఏం కనిపించడం లేదు.

పైన నింగీ

కింద నేలా –

అసిరిగాడు గుండెలనిండా ఓ వెర్రినవ్వు నవ్వాడు- "రజా చచ్చిపోయిందా ? వెర్రివాళ్ళల్లారా లేదు అదిగో చూడండి...నీలం చీర కట్టుకుని బాణంలా అందంగా వంగి అటూ ఇటూ నేనున్న నేలని ఎలా ముట్టుకుంటోందో! ... నవ్వుతూ రమ్మంటోంది...రారా బాబిగాపోదాం" అంటూ బాబిగాడి నో బుజాన్నీ చావుబాజా నో బుజాన్నీ వేసుకొని లేచాడు అసిరిగాడు.

ఊరుదాటి నింగీ నేలా కలిసే చోటువైపు పోతున్న అసిరిగాడిని చూసి "వీడికి పిచ్చెక్కిందను"కొన్నారు కొందరు.

దూరాన్నుంచి క్రమేపీతగ్గిపోతూ సన్నగా వినిపిస్తూన్న వాడి బాజా విని, "పాపం ఎవరో పోయారు!" అనుకొన్నారు మరికొందరు.

అంతేకాని -

మతి తప్పిన అసిరిగాడు శ్రుతి తప్పిన బతుకులకే చావు బాజా వాయిస్తూ, అప్పిచ్చువాడూ, వైద్యుడూ లేని ఊరుకోసం వెతుక్కుంటూ పోతున్నాడని మాత్రం ఎవరూ అనుకో లేదు.